


సింగపూర్ ఐటీఈతో ఒప్పందం కుదుర్చుకుంటున్న సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

# సింగపూర్ ఐటీఈతో స్కిల్ వర్సిటీ ఎంవోయూ

- నైపుణ్యాల అభివృద్ధికి పరస్పర సహకారం
- ఐటీఈ క్యాంపస్‌ను సందర్శించిన సీఎం రేవంత్ బృందం

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో కలిసి పనిచేసేందుకు సింగపూర్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) సంస్థ సంసిద్ధతను వ్యక్తంచేసింది. ఈ మేరకు ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం శుక్రవారం సింగపూర్ చేరుకుంది. అక్కడి ఐటీఈ క్యాంపస్‌ను సందర్శించింది. అక్కడ నైపుణ్యాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న కోర్సులను, సదుపాయాలను పరిశీలించింది. అక్కడ శిక్షణ ఇస్తున్న దాదాపు 20 రంగాలకు చెందిన నిపుణులు, కాలేజీ సిబ్బందితో, ఐటీఈ ఉన్నతాధికారులతో చర్చలు జరిపింది. ఈ సందర్భంగా తమ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. యువతకు ఉపాధి కల్పించేందుకు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా వివిధ కోర్సులు నిర్వహిస్తున్న తీరును ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. నైపుణ్యాల అభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్) శిక్షణలో పరస్పర సహకారంతో భాగస్వామ్యం పంచుకోవాలని ప్రతిపాదించారు. దీనికి ఐటీఈ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. ఈ సందర్భంగా కుదుర్చుకున్న ఎంవోయూపై వర్సిటీ వీసీ సుబ్బారావు, సింగపూర్ ఐటీఈ తరఫున అకడమిక్ అండ్ అడ్మిన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ పర్వేందర్‌సింగ్ సంతకాలు చేశారు. త్వరలోనే ఐటీఈ ప్రతినిధి బృందం హైదరాబాద్‌ను సందర్శించనున్నది. పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్, సీఎం ప్రత్యేకకార్యదర్శి అజిత్‌రెడ్డి, యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ వీసీ వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావు ఉన్నారు.

### సింగపూర్ విదేశాంగ మంత్రితో భేటీ

తొలిరోజు పర్యటనలో భాగంగా సింగపూర్ విదేశాంగ మంత్రి వివియాన్ బాలకృష్ణన్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, నదుల పునరుజ్జీవనం, నీటి వనరుల నిర్వహణ, హరిత ఇంధనం, పర్యాటకం, విద్య, నైపుణ్యాల అభివృద్ధి, ఐటీ పార్కుల అభివృద్ధి అంశాలపై చర్చలు జరిపారు.

# ఏజెన్సీ ఏరియాల్లో కార్పొరేషన్ ఏంటి?

- సర్కారు నిర్ణయం అసంబద్ధమని గిరిజన సంఘాల ధ్వజం

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలైన పాల్వంచ, మణుగూరు, భద్రాచలంను కలుపుతూ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదన అసంబద్ధమని గిరిజన సంఘాల ఐక్య వేదిక నాయకులు మండిపడ్డారు. ఏజెన్సీ ఏరియాలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసి పన్నులు వసూలు చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 9ఏ, 243 జడ్‌సీకి విరుద్ధమని తెలిపారు. ఈ మేరకు కలెక్టర్, తహసీల్దార్ జారీ చేసిన ఉత్తర్వులను పునఃపరిశీలించాలని శుక్రవారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్‌శాఖ అధికారులు అభ్యంతరం చెబుతున్నప్పటికీ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటుకు పూనుకోవడం సరికాదని మండిపడ్డారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా మార్గదర్శనం చేయాలని విన్నవించారు.

# కొడంగల్ లిఫ్ట్ రేవంత్‌కు ఆదాయ వనరు

- ఎన్నికల ముందే అవినీతి ఒప్పందాలు
- అన్ని ఒప్పందాల్లో ఆ నలుగురిదే కీలక పాత్ర
- భారీ స్కామ్‌లో సీఎం రేవంత్, నరేందర్‌రెడ్డి సహా మేఘా, రాఘవ కన్‌స్ట్రక్షన్స్
- 45 మంది ఫోన్లు ట్యాప్ చేస్తున్న రాష్ట్ర సర్కార్: కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నేత బక్క జడ్సన్




సమావేశంలో మాట్లాడుతున్న బక్క జడ్సన్

హైదరాబాద్ సిటీబ్యూరో/ఖైరతాబాద్, జనవరి 17(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డికి నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆదాయ వనరుగా మారిందని కాంగ్రెస్ బహిష్కృత నేత, ఏఐసీసీ మాజీ సభ్యుడు బక్క జడ్సన్ ఆరోపించారు. తెలంగాణలో ఎన్నికల నిధుల నుంచి ఇటీవలి ప్రాజెక్టుల ఒప్పందాల వరకు అవినీతి అవకతవకలపై సీబీఐతో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సహా మేఘా కన్‌స్ట్రక్షన్స్, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థలు పలు అవినీతి అవకతవకలకు పాల్పడుతున్నట్టు జడ్సన్ సంచలన ఆరోపణలు చేశారు. ఆ నలుగురి అవినీతి అక్రమాలపై తన వద్ద అన్ని సాక్షాధారాలు ఉన్నాయని, వెంటనే ఆ నలుగురిపై కేసులు నమోదు చేయాలని కోరారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 సార్వత్రిక ఎన్నికల సమయంలో మేఘా, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థల నుంచి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ఎన్నికల బాండ్లు, ఇతర దారుల్లో సుమారు రూ.148 కోట్లు అందాయని, వెస్టర్న్ యూపీ పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ లిమిటెడ్ ద్వారా 2023 అక్టోబర్ 10న రూ.50 కోట్లు కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లాయని, 2023 నవంబర్ 20, 21 తేదీల్లో మరో రూ.60 కోట్లు అందాయని ఆరోపించారు. ఎస్ఈపీసీ పవర్ లిమిటెడ్ కంపెనీ ద్వారా 2023 నవంబర్ 21న రూ.30 కోట్లు ఇచ్చారని తెలిపారు. ఇవన్నీ నవంబర్ నెలలో రాహుల్‌గాంధీ ఎన్నికల పర్యటనలో, కోడ్ ఉన్నప్పుడు పూర్తిగా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా చెల్లించారని చెప్పారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మేఘా, రాఘవ కంపెనీలతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఒప్పందాలు కుదుర్చుకొని కాంట్రాక్టులు కట్టబెట్టిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచే ముఖ్యమంత్రి కావాలన్న ఉద్దేశంతో కష్టపడి పనిచేసే కొందరు నాయకులను పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయేలా చేశాడని, ఆ సమయంలోనే రేవంత్‌రెడ్డి అన్నిరకాల డీల్స్ కుదుర్చుకున్నారని తెలిపారు. ఎన్నికల ముందు మేఘా సంస్థపై విచారణ జరిపించి డబ్బు కక్కిస్తానని చెప్పిన రాహుల్‌గాంధీకి నేడు అదే మేఘా కృష్ణారెడ్డి క్లోజ్ ఫ్రెండ్ అయిపోయారని ఆరోపించారు.

### 'కొడంగల్ లిఫ్టు' అంచనా వ్యయం నాలుగింతలు

నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఆ నలుగురికి అవినీతి ఆదాయ వనరుగా మారిందని బక్క జడ్సన్ విమర్శించారు. తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకోవడానికి ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయాన్ని నాలుగింతలు పెంచారని ఆరోపించారు. 2014లో రూ.1,450.51 కోట్ల అంచనా వ్యయం ఉండగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి దాని అంచనా వ్యయాన్ని రూ.2,945 కోట్లకు పెంచారని, రెండు నెలలు తిరక్కుండానే మరోసారి రూ.4,350 కోట్లకు పెంచారని వివరించారు. ఈ లిఫ్టు ఇరిగేషన్‌లో విచిత్రంగా వర్క్ అలాట్ చేశారని, మొదట రాఘవ కన్‌స్ట్రక్షన్స్, మీల్, ఎల్ అండ్‌టీ, నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ ముందుకు రాగా, వాటన్నింటినీ కాదని, ఎల్1గా పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్, ఎల్2గా మీల్ సంస్థకు అప్పజెప్పారని తెలిపారు. ఇందులో క్విడ్‌ప్రోకో ద్వారానే అది సాధ్యమైందనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ డీల్ కుదుర్చుకున్నది ఓటుకు నోటు కేసులో ఉన్న ఏ1 నిందితుడు సీఎం రేవంత్‌రెడ్డి కాగా, అదే కేసులో ఏ2గా ఉన్న ప్రస్తుత ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి.. ఈ డీల్‌కు మధ్యవర్తిత్వం నడిపారని ఆరోపించారు.

### 45 మంది ఫోన్ ట్యాపింగ్

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలతోపాటు అధికారులు, సామాజికవేత్తలు, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారి ఫోన్లను ట్యాప్ చేస్తున్నదని జడ్సన్ ఆరోపించారు. తాను ఇటీవల ఒక అధికారిని కలిసినప్పుడు ఆయన ఈ విషయం చెప్పారని, సుమారు 45 మంది మొబైల్ ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని, ఇందులో 25 మంది కాంగ్రెస్ వారేనని, వారిలో కూడా 12 మంది మంత్రులు, ఇద్దరు ఎంపీల ఫోన్లు ఉన్నాయని ఆ అధికారి చెప్పారని జడ్సన్ వివరించారు. సమావేశంలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ జనార్ధన్, గిరిబాబు పాల్గొన్నారు.

# 'ఓపెన్ ఏఐ' నా కుమారుడిని పొట్టనబెట్టుకుంది

- అతడిది ఆత్మహత్య కాదు.. హత్యే..
- సుచిర్ బాలాజీ తల్లి ఆరోపణ
- ఎఫ్‌బీఐ విచారణకు డిమాండ్

న్యూఢిల్లీ, జనవరి 17: ఇటీవల అమెరికాలో అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించిన భారత సంతతికి చెందిన విజిల్‌బ్లోయర్, ఓపెన్ ఏఐ పరిశోధకుడు సుచిర్ బాలాజీ తల్లి పూర్ణిమ రావు సంచలన ఆరోపణలు చేశారు. సామ్ ఆల్ట్‌మన్ నేతృత్వంలోని ఓపెన్ ఏఐ కంపెనీయే తన కుమారుడి మరణానికి కారణమని ఆరోపించారు. వారికి వ్యతిరేకంగా తన కుమారుడి వద్ద కొన్ని పత్రాలు ఉన్నాయని ఆమె తెలిపారు. ఓపెన్ ఏఐ మాజీ ఉద్యోగి అయిన 26 ఏండ్ల సుచిర్ బాలాజీ గత ఏడాది నవంబర్‌లో శాన్‌ఫ్రాన్సిస్కోలోని తన అపార్ట్‌మెంట్‌లో అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఓపెన్ ఏఐతో విభేదించి అందులోంచి బయటకు వచ్చిన సుచిర్ తర్వాత దాని అవకతవకలను, లోపాలను, అది అనుసరిస్తున్న అనైతిక విధానాలను ప్రశ్నిస్తూ విజిల్‌బ్లోయర్‌గా మారాడు. అమెరికన్ కామెంటేటర్ టక్కర్ కార్ల్‌సన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కుమారుడిది ఆత్మహత్య కాదని, హత్యని పూర్ణిమ రావు మరోసారి ఆరోపించారు. దీనిపై ఎఫ్‌బీఐ విచారణ జరపాలని తమ కుటుంబం కోరుకుంటున్నదన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు సుచిర్‌ది ఆత్మహత్యని 14 నిమిషాల్లోనే ప్రకటించారని, కానీ వారి కేసు దర్యాప్తులో అనేక లోపాలు ఉన్నాయని, వాస్తవానికి అది ఆత్మహత్య కాదు హత్య అని ఆమె తెలిపారు.

### స్పందించిన ఎలాన్ మస్క్

సుచిర్ బాలాజీ మరణంపై ఆమె తల్లి చేసిన ఆరోపణలపై బిలియనీర్ ఎలాన్ మస్క్ స్పందించారు. ఓపెన్ ఏఐ లాభదాయక సంస్థగా మార్పు చెందడం పట్ల ఆందోళన వ్యక్తం చేసిన ఆయన సుచిర్‌ది ఆత్మహత్యలా అనిపించడం లేదని పేర్కొన్నారు. ఆమె ఇంటర్వ్యూను పోస్ట్ చేస్తూ 'చాలా ఆందోళనకరం' అని వ్యాఖ్యానించారు. ' సుచిర్ బాలాజీది ఆత్మహత్య కాదని ఆమె తల్లి భావిస్తున్నారు. అందుకే ఆమె ఎఫ్‌బీఐ దర్యాప్తు కోరుతున్నారు' అని పేర్కొన్నారు.

# మహిళా వర్సిటీ బిల్లుకు ఆమోదం

- గెజిట్ జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- యూజీసీ గుర్తింపుయే తరువాయి

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ బిల్లుకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం గెజిట్ జారీచేసింది. దీంతో వర్సిటీ ఏర్పాటు ప్రక్రియలో తుది అంకం పూర్తయింది. ప్రభుత్వం జీవోను జారీచేయడంతో యూజీసీ గుర్తింపునకు వర్సిటీ అధికారులు దరఖాస్తు చేయనున్నారు. యూజీసీ గుర్తింపు లాంఛనమేకానుంది. అయితే ఇప్పటికే చదువుతున్న విద్యార్థులకు ఏ పేరుతో సర్టిఫికెట్లు ఇవ్వాలన్న అంశంపై సందిగ్ధత కొనసాగుతున్నది. దీనిపై అధికారులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. ప్రతిష్ఠాత్మక కోఠి మహిళా కాలేజీని తెలంగాణ ఉమెన్ వర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ గత కేసీఆర్ ప్రభుత్వం జీవో జారీచేసింది. అప్పట్లో తెలంగాణ మహిళా యూనివర్సిటీగా నామకరణం చేశారు. ఇటీవల కాంగ్రెస్ సర్కారు పేరు మార్చి, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ అన్న పేరును ఖరారుచేసింది. వర్సిటీ అభివృద్ధికి ఐదేండ్ల ప్రణాళికలను రూపొందించినట్టు వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సూర్యాధనుంజయ్ తెలిపారు. రూ.100 కోట్ల బడ్జెట్‌తో పాటు, పోస్టుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, టెక్నాలజీ, లా, బీఈడీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ తదితర కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ ఫిజియోథెరపీ, సీఎస్ఈ - ఏఐఎంఎల్, డాటాసైన్స్ వంటి కోర్సులను సైతం ప్రవేశపెడతామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నైపుణ్యాలకు అధిక ప్రాధాన్యమిస్తూ స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.

# అంగన్‌వాడీల్లో అసంతృప్త జ్వాలలు

- ప్రీప్రైమరీ టీచర్లుగా గుర్తించాలని డిమాండ్
- ఎన్నికల సమయంలో మాట తప్పిన కాంగ్రెస్‌పై కేంద్రాల సిబ్బంది గుర్రు
- డిమాండ్ల పరిష్కారానికి ఎంపీలకు లేఖలు రాసేందుకు సన్నద్ధం

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లలో అసంతృప్త జ్వాలలు రగులుతున్నాయి. ఎంతోకాలంగా అంగన్‌వాడీల్లో సేవలందిస్తున్న తమను ప్రీ ప్రైమరీ టీచర్లుగా గుర్తించాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో జీతాలు పెంచుతామని, సమస్యలను పరిష్కరిస్తామని మ్యానిఫెస్టోలో చేర్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలు చేయకపోవడంపై అంగన్‌వాడీలు గుర్రుగా ఉన్నారు. డిమాండ్ల సాధన కోసం ఇప్పటికే పలుమార్లు ధర్నాలు, రాస్తారోకోలు వంటి నిరసన కార్యక్రమాలు చేశారు. మంత్రులు, సంబంధిత అధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు అందజేశారు. అయినా ఇప్పటివరకు ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీంతో తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రంలోని ఎంపీలందరికీ లేఖలు రాసేందుకు సిద్ధమైనట్టు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్ల సంఘం నాయకురాలు సునీత తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 11 వేలకు పైగా ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

# బీసీ గురుకులాల సొసైటీతో ప్యూర్ ఎంవోయూ

హైదరాబాద్, జనవరి17 (నమస్తే తెలంగాణ): వెనుకబడిన తరగతుల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలను అందించడంలో భాగంగా మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్), ప్యూర్ (పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్) మధ్య ఎంవోయూ కుదిరింది. శుక్రవారం ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ ప్రధాన కార్యాలయంలో కార్యదర్శి బీ సైదులు, ప్యూర్ సీఈవో డాక్టర్ శైలా తల్లూరి సంతకాలు చేశారు. విద్యార్థుల సాంకేతిక నైపుణ్యతను, నాయకత్వ లక్షణాలను, సామాజిక సేవలను, నెలసరి స్వచ్ఛతను ప్రోత్సహించే లక్ష్యాలతో ఈ అవగాహన ఒప్పందం కుదిరినట్టు వారు తెలిపారు. పర్యావరణ సుస్థిరత, లింగ సమానత్వం, పౌర బాధ్యత వంటి కీలక సామాజిక సమస్యలపై వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### జల్లికట్టులో విషాదం

- ఏడుగురి మృతి, వందల మందికి గాయాలు

చెన్నై, జనవరి 17: కానుమ్ పొంగల్ సందర్భంగా తమిళనాడు వ్యాప్తంగా శుక్రవారం జరిగిన జల్లికట్టు, మంజువిరట్టు కార్యక్రమాల్లో విషాదం చోటు చేసుకుంది. వేర్వేరు ప్రాంతాల్లో ఒక ఎద్దు యజమాని సహా ఆరుగురు ప్రేక్షకులు చనిపోయారు. వందల మంది గాయపడ్డారు.

# ప్రజాభవన్‌కు వస్తేనే ఇల్లు ఇస్తరా?

మొదటిపేజీ తరువాయి...

శాఖలకు పంపుతున్నామని అక్కడి అధికారులు ఆశ పెడుతున్నారు. ప్రజాభవన్‌లో దరఖాస్తు చేసిన ప్రతీఒక్కరి ఫోన్ నంబర్‌కు మెసేజ్ వస్తుండడంతో 'హైదరాబాద్‌కు వెళ్లి దరఖాస్తు చేస్తే ఇల్లు మంజూరవుతుందేమో?' అనే ఆలోచన జనంలో పెరిగిపోతున్నది. దీంతో వ్యయప్రయాసలకోర్చి ప్రజాభవన్ ముందు బారులు తీరుతున్నారు.

### ఇంటి కోసం ఆశతో

నిరుడు డిసెంబర్ వరకు ప్రజావాణికి సగటున 500 దరఖాస్తులు వచ్చేవి. నెల మొత్తంలో ఇండ్ల కోసం 300కు మించి దరఖాస్తులు రాలేదు. కానీ ప్రస్తుతం రోజుకు 3వేల మందికిపైగా తరలివస్తున్నారు. ఈ నెల 10న ప్రజావాణిలో 3,348 దరఖాస్తులు రాగా, ఇందులో 2,871, 86 శాతం మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం చేసుకున్న దరఖాస్తులు ఉన్నాయి. శుక్రవారం ప్రజావాణిలోనూ 3,053 దరఖాస్తులు రాగా అందులో 2,691, అంటే 88శాతం దరఖాస్తులు ఇందిరమ్మ ఇండ్ల కోసం చేసినవేనని స్పష్టమవుతున్నది.

### ప్రభుత్వం విఫలం


గతంలో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా స్థలం ఉండి, ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దరఖాస్తులపై అధికారులు క్షేత్రస్థాయి సర్వే చేస్తున్నారు. దరఖాస్తులను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని గమనించిన ప్రజలు ప్రజాభవన్‌కు పోటెత్తుతున్నారు. ఇందిరమ్మ కమిటీల్లో ప్రధానంగా కాంగ్రెస్ నేతలకే చోటు కల్పించడం, ఇంచార్జి మంత్రి చెప్పిన వారికే ఇండ్లు ఇవ్వాలన్న నిబంధనలు ఉండడంతో జనం ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో దరఖాస్తు ఇస్తే ఇల్లు రాదేమోనని, ప్రజాభవన్‌కు వస్తేనే దరఖాస్తు పరిశీలిస్తారని భావిస్తున్నారు. దీంతో దూరప్రాంతాల నుంచి హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు వచ్చి అర్జీలు ఇస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని 'ఊర్లో ఉంటే ఇల్లు మంజూరవుతుందా? లేదా ప్రజాభవన్‌లో దరఖాస్తు చేసినవారికి ఇల్లు మంజూరవుతుందా? అనే అంశంలో స్పష్టమైన ప్రకటన చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

**ప్రజాభవన్‌కు ఇండ్ల కోసం ఆశావహులు**

| తేదీ | దరఖాస్తులు | ఇండ్ల కోసం | శాతం |
|---|---|---|---|
| జనవరి10 | 3348 | 2871 | 86 |
| జనవరి17 | 3053 | 2691 | 88 |
| మొత్తం | 6401 | 5562 | 87 |

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు


- వీఆర్వో పోస్టులకు త్వరలో పరీక్షలు: పొంగులేటి



హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదేనని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొదటి విడతలో స్థలం ఉన్నవారికి, రెండో విడతలో ఇంటి స్థలంతోపాటు ఇల్లును నిర్మించి ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు, వీఆర్వో వ్యవస్థ, సర్వేయర్ల నియామకంపై శుక్రవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి నివాస స్థలం ఉన్నవారి జాబితా, నివాస స్థలం లేనివారి జాబితాను గ్రామసభల్లో పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం హౌసింగ్ కార్పొరేషన్‌లో 274 మంది ఇంజినీర్లు మాత్రమే ఉన్నారని, ఇతర విభాగాల నుంచి మరో 400 మందిని ఉపయోగించుకునే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. కొత్త వీఆర్వో వ్యవస్థ ఏర్పాటు కోసం పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏల నుంచి అర్హులను రాతపరీక్ష ద్వారా ఎంపికచేస్తామని వెల్లడించారు. ఈ మేరకు విధివిధానాలను వెంటనే రూపొందించి, పరీక్షకు ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 450 మంది సర్వేయర్లు ఉన్నారని, మరో వెయ్యి మంది ఎంపికకు ప్రణాళిక తయారుచేయాలని సూచించారు. సమావేశంలో సీఎస్ శాంతికుమారి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్, హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధప్రకాశ్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సీఎంఆర్వో డైరెక్టర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వరా?

- భీమారం తహసీల్ ఎదుట యువకుల నిరసన



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న యువకులు

భీమారం, జనవరి 17: 'మాకు రేషన్ బియ్యం వస్తలేవు.. ఏ ప్రాతిపదికన రేషన్‌కార్డుల లిస్టు తయారుచేశారు? అర్హులకు అన్యాయం చేస్తే ఊరుకోం.. గ్రామసభ రోజు ఎంపీడీవో, తహసీల్దార్‌ను నిర్బంధిస్తాం' అంటూ మంచిర్యాల జిల్లా భీమారంనకు చెందిన యువకులు హెచ్చరించారు. భీమారానికి చెందిన 182 మందితో కూడిన రేషన్‌కార్డుల లిస్టు బయటకు రావడంతో వారంతా తహసీల్దార్ కార్యాలయానికి శుక్రవారం ఉదయం చేరుకున్నారు. లిస్టులో 182 మంది పేర్లు వచ్చాయని, అందులో కొంత మంది రిటైర్డ్ సింగరేణి కార్మికులు ఉన్నారని, ఏ ప్రాతిపదికన లిస్టు రూపొందించారని ప్రశ్నించారు. గ్రామం లో 1600 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నా వారి పేర్లు ఎందుకు రాలేదని, అనర్హుల పేర్లు ఎలా వచ్చాయని తహసీల్దార్‌ను నిలదీశారు. దీంతో తహసీల్దార్ మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ' సర్వే నిలిపివేయాలని స్థానికులు గొడవ చేస్తున్నారని చెప్పగా.. మరో లిస్టు వస్తుందని, ఇది ఫైనల్ లిస్ట్ కాదని కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్లకు రేషన్‌కార్డుల బాధ్యత ఇవ్వలేదని, ఎంపీడీవోలకే వాటి బాధ్యతలు అప్పగించారని తెలిపారు.

# కల్యాణలక్ష్మి చెక్కు కోసం 5 వేలు లంచం

- ఏసీబీకి చిక్కిన డిండి ఆర్‌ఐ



డిండి ఆర్‌ఐ శ్యామ్‌నాయక్

డిండి, జనవరి 17 : కల్యాణ లక్ష్మి చెక్కు ఇచ్చేందుకు లంచం తీసుకుంటూ డిండి ఆర్‌ఐ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. నల్లగొండ జిల్లా డిండి మండలం పడమటితండాకు చెందిన పాండునాయక్ తన కూతురికి సంబంధించిన కల్యాణ లక్ష్మి చెక్కు ఇచ్చేందుకు డిండి ఆర్‌ఐ శ్యామ్‌నాయక్ రూ.10 వేలు డిమాండ్ చేశాడు. మొదట రూ.5 వేలు ఇస్తానని, మిగతావి తర్వాత ఇస్తానని పాండునాయక్ ఒప్పందం చేసుకున్నాడు. ఈ క్రమంలో శ్యామ్‌నాయక్ శుక్రవారం హైదరాబాద్ హస్తినాపురంలోని తన నివాసంలో పాండునాయక్ నుంచి రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గతంలో కూడా పీఏపల్లి ఆర్‌ఐగా పనిచేస్తూ అవినీతి ఆరోపణలతో శ్యామ్‌నాయక్ సస్పెండ్ అయ్యాడు. ఆర్‌ఐ నివాసంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు నల్లగొండ ఏసీబీ డీఎస్పీ జగదీశ్ చందర్ తెలిపారు.

# ఏసీబీకి చిక్కిన ఈఎన్‌టీ దవాఖాన సీనియర్ అసిస్టెంట్



సంతోష్ తివారీ

సుల్తాన్‌బజార్, జనవరి 17: ఉద్యోగ విరమణ ప్రయోజనాల ఫైల్‌ను ప్రాసెస్ చేసేందుకు లంచం తీసుకుంటూ ఈఎన్‌టీ ప్రభుత్వ దవాఖాన సీనియర్ అసిస్టెంట్ ఆర్ సంతోష్ తివారీ ఏసీబీకి చిక్కాడు. ఓ ఉద్యోగికి సంబంధించిన విరమణ ఫైల్‌ను ప్రాసెస్ చేసేందుకు రూ. 20 వేలు లంచం అడిగాడు. ఈ క్రమంలో ఇప్పటికే రూ. 17 వేలు తీసుకున్నాడు. మరో రూ. 3వేల కోసం పట్టుబట్టడంతో రిటైర్డ్ ఉద్యోగి ఏసీబీని ఆశ్రయించాడు. శుక్రవారం ఏవో సంతోష్ తివారీకి రూ. 3 వేలు లంచం ఇస్తుండగా, ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని ఏసీబీ న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు.

# జాబులేవి? క్యాలెండర్ ఏది?

మొదటిపేజీ తరువాయి...

తప్పదని హెచ్చరిస్తున్నారు. అశోక్‌నగర్, దిల్‌సుక్‌నగర్‌లో జేఏసీలుగా ఏర్పడి సర్కార్‌పై మరో సమరానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సోషల్ మీడియా గ్రూపులలో ఎక్కడ చూసినా ఇదే చర్చ నడుస్తున్నది.

### క్రెడిట్ చోర్‌కి కేరాఫ్

55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటున్నది. వాస్తవానికి ఇది పచ్చిమోసం. కాంగ్రెస్ పార్టీ క్రెడిట్ చోర్‌కి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని నిరుద్యోగులు ధ్వజమెత్తుతున్నారు. పక్కవాళ్ల క్రెడిట్ దొబ్బేయడంలో కాంగ్రెస్ నాయకులను మించినోళ్లు లేరని వాదిస్తున్నారు. నిజానికి గ్రూప్ 1, 2, 3 పోస్టుల భర్తీకి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే నోటిఫికేషన్లు ఇచ్చింది. మహిళా శిశు సంక్షేమశాఖ, పోలీస్, విద్యుత్తు సంస్థలు, గురుకులాల్లో ఉద్యోగాల భర్తీకి బీఆర్‌ఎస్ హయాంలోనే నోటిఫికేషన్లు వెలువడ్డాయి. రకరకాల కారణాలతో వాటికి కాంగ్రెస్ పాలనలో కొన్ని నియామక ఉత్తర్వులు ఇవ్వగా, మరికొన్ని పరీక్షలు నిర్వహించారు. గ్రూప్-4 పోస్టులకు కూడా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమే నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలు నిర్వహించి భర్తీ చేయగా.. రేవంత్‌రెడ్డి వాటికి నియామక పత్రాలను అందించి తామే ఇచ్చినట్టు బిల్డప్ ఇచ్చారు. ఇంత కన్నా మోసం మరోటి ఉంటుందా? అని నిరుద్యోగ యువత ఉదహరణగా చూపుతున్నది. బీఆర్‌ఎస్ ఇచ్చిన ఉద్యోగాలను ఏమాత్రం జంకు గొంకు లేకుండా తమ ఖాతాలో వేసేసుకోవడంపై వారు ఆక్షేపిస్తున్నారు.

### భగ్గుమంటున్న నిరుద్యోగులు

ఉద్యోగాల భర్తీపై సర్కారు నిర్లక్ష్యంపై నిరుద్యోగులు భగ్గుమంటున్నారు. వయోపరిమితి మించిపోతుండటంతో చాలా మంది చివరి అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. వారంతా పెద్ద సంఖ్యలోనే ఉండటం గమనార్హం. తమ బాధలు ప్రభుత్వానికి పట్టవా అంటూ వారు ఏకరువు పెడుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే ఉద్యమ బాట తప్పదని హెచ్చరిస్తున్నారు. దీంతో నిరుద్యోగ జేఏసీ నేతలు సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగసభకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 24న నేతాజీ జయంతి సందర్భంగా రక్తదానం వంటి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.




### ఉత్తచేతులతో టీజీపీఎస్సీ..

ఇంతవరకు పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో టీజీపీఎస్సీ ఉత్తచేతులతో నడుస్తున్నది. భర్తీ చేసే పోస్టులు తమ చేతిలో లేకపోవడంతో పాత నోటిఫికేషన్లను ఒక్కొక్కటిగా క్లియర్ చేస్తున్నది. మే తర్వాతే నోటిఫికేషన్లు జారీచేస్తామని టీజీపీఎస్సీ ఇటీవలే ప్రకటించింది. భర్తీచేసే ఉద్యోగాల వివరాలివ్వాలంటూ సర్కారుకు లేఖ రాస్తామని తెలిపింది. మే దాకా నోటిఫికేషన్లు రావన్నమాట. ఆ ఆరు నెలలు స్థానిక ఎన్నికల కోడ్ ఉండే అవకాశం ఉండటంతో ఉద్యోగ భర్తీపై ప్రభావం పడే అవకాశం ఉన్నది. దీంతో ఈ ఏడాది ఉద్యోగాల భర్తీ ఉండకపోవచ్చనే ఆందోళనలో నిరుద్యోగ యువకులు ఉన్నారు.

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడిస్తాం

మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు మరికొన్ని మోసాలకు తెరలేపుతున్నది. రెండు లక్షల ఉద్యోగాలు అబద్ధం. నెలకు నాలుగు వేల నిరుద్యోగ భృతి అబద్ధం. ఇది చాలదంటూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు గ్రూప్-1, గ్రూప్-2, ఎస్ఐ, కానిస్టేబుల్, డీఎస్సీ అంటూ మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నది. నిరుద్యోగుల సత్తాచూపుతాం. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి తీరుతాం.

- జనార్దన్, నిరుద్యోగ జేఏసీ నేత